సాక్షి
ఆదిలాబాద్
శనివారం। 26। జూలై। 2025



రైతన్నా.. జర భద్రం
పురుగు మందులంటేనే అత్యంత ప్రమాదకరమైనవి. సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో రైతులు, కూలీలు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. 8లో▸



జాగ్రత్తలు పాటించాలి 9లో▸
విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలని ఎన్పీడీసీఎల్ సీజీఆర్ఎఫ్ ఛైర్మన్ నారాయణ అన్నారు. నేరడిగొండలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు.

గరిష్టం/కనిష్టం
25.0/22.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ శాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

ఒత్తిడిని అధిగమించాలి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి ప్రభాకరరావు

ఆదిలాబాద్‌టౌన్: కోర్టులో విధులు నిర్వహించే జడ్జీలు, న్యాయవాదులు ఒత్తిడిని అధిగమిస్తూ ముందుకు సాగాలని జిల్లా జడ్జి కె.ప్రభాకరరావు అన్నారు. ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ న్యాయ శ్రేయ దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం మాట్లాడారు. కోర్టులో జడ్జీలు, న్యాయవాదులు ఒత్తిడితో ఉంటారని, పరస్పర సహకారంతో కక్షిదారులకు ఉన్నతమైన న్యాయం అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు జడ్జి శివరాంప్రసాద్, ఫ్యామిలీ కోర్టు జడ్జి లక్ష్మీకుమారి, ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి వివేక్, సీనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి, జూనియర్ సివిల్ జడ్జి హుస్సేన్ నాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్నాల నగేశ్, డీఎస్పీ శర్మ, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారిగా హరికిరణ్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారిగా రాష్ట్ర అబ్కారీ కమిషనర్ సి.హరికిరణ్ నియామకం అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లా పరిధి ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు ప్రత్యేక అధికారిగా ఆయా జిల్లా కలెక్టర్లతో పర్యవేక్షణ చేస్తూ ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లేందుకు పని చేయనున్నారు. గతంలో ఉమ్మడి జిల్లా ప్రత్యేకఅధికారిగా ఇలంబర్తి పని చేయగా, ప్రస్తుతం ఆయన స్థానంలో హరికిరణ్ నియమితులయ్యారు.

కేజీబీవీల్లో సీఆర్టీ పోస్టుల భర్తీ



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న సీఆర్టీ పోస్టులను భర్తీ చేశారు. ఇటీవల సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టిన విద్యాశాఖ అధికారులు శుక్రవారం డీఈవో కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి వారికి నియామక పత్రాలు అందజేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని సూచించారు. జిల్లాలో ఐదు పోస్టులు ఖాళీగా ఉండగా, నాలుగు భర్తీ చేసినట్లు తెలిపారు. మావల కేజీబీవీలో ఫిజికల్ సైన్స్, ఉట్నూర్‌లో బయోసైన్స్, ఇచ్చోడలో పీజీ సీఆర్టీ నర్సింగ్, బేలలో పీజీ సీఆర్టీ బాటనీ పోస్టులు భర్తీ చేసినట్లు పేర్కొన్నారు. సీఆర్టీ పీఈటీ పోస్టింగ్‌కు సంబంధించి అభ్యర్థి నాట్ విల్లింగ్ ఇచ్చారని, దీంతో ఆ పోస్టును భర్తీ చేయలేదని వివరించారు. గత నియామకాల్లో ఒకరికి బదులు మరొకరికి పోస్టింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఫిజికల్ సైన్స్‌కు సంబంధించి 8వ ర్యాంక్ అభ్యర్థిని తొలగించి 7వ ర్యాంక్ అభ్యర్థికి పోస్టింగ్ కల్పించారు. ఇందుకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ అర్బన్ విద్యాధికారి సోమయ్య, డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్ వేణు, కేజీబీవీ సెక్టోరియల్ అధికారి ఉదయ్‌శ్రీ, రమేశ్ పాల్గొన్నారు.

'ఓపెన్' పరీక్ష ఫీజు చెల్లించండి

ఆదిలాబాద్‌టౌన్: ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్ పొందిన అభ్యర్థులు ఆగస్టు 15 వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈవో శ్రీనివాస్ రెడ్డి, ఓపెన్‌స్కూల్ కోఆర్డినేటర్ అశోక్ ప్రకటనలో తెలిపారు. పదోతరగతి పరీక్షఫీజు సబ్జెక్టుకు రూ.100, ప్రాక్టికల్‌కు రూ.100, ఇంటర్మీడియెట్ పరీక్ష ఫీజు సబ్జెక్టుకు రూ.150, ప్రాక్టికల్‌కు రూ.150 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. తత్కాల్ కింద ఫీజు చెల్లించేందుకు పదో తరగతిలో ప్రతీ సబ్జెక్టుకు రూ.500, ఇంటర్మీడియెట్‌లో రూ.వెయ్యి అదనంగా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

మలేరియా నియంత్రణకు చర్యలు

నేరడిగొండ: మలేరియా నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. నేరడిగొండ పీహెచ్‌సీ పరిధిలోని కుప్టి గ్రామంలో మలేరియా పాజిటివ్ కేసు నమోదు కాగా శుక్రవారం ఆ గ్రామాన్ని సందర్శించారు. ప్రభావిత ప్రాంతాల్లో ఇన్‌సెక్టిసైడ్ స్ప్రే చేయించడంతో పాటు బ్రీడింగ్ సైట్లను గుర్తించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే చేపట్టాలని, అవసరమైన వారికి మందులు పంపిణీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం డ్రైడే కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని పలు ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పించారు. నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. ఇందులో ఎంపీడీవో శేఖర్, ఎంపీవో లక్ష్మణ్, డీఎంవో శ్రీధర్, హెచ్‌ఈవో రవీందర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టా.. రెగ్యులరా!

- రిమ్స్‌లో రెగ్యులర్ ప్రొఫెసర్లను కేటాయించిన ప్రభుత్వం
- కోర్టును ఆశ్రయించిన కాంట్రాక్ట్ ప్రొఫెసర్లు
- న్యాయస్థానం తీర్పుపై ఉత్కంఠ



రిమ్స్ ఆస్పత్రి

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రిలో కాంట్రాక్ట్ ప్రొఫెసర్లు కొనసాగేనా.. లేక రెగ్యులర్‌గా నియామకమైన ప్రొఫెసర్లతో సేవలు అందించేనా అనే సందేహం నెలకొంది. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా మెడికల్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా రిమ్స్‌కు తొమ్మిది మంది ప్రొఫెసర్లను నియమించింది. దీంతో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ అవుతున్నాయనే సర్వత్రా హర్షం వ్యక్తమైంది. రెగ్యులర్ ప్రొఫెసర్లు విధుల్లో చేరితే ప్రస్తుతం కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న వారిని తొలగించాల్సి ఉంటుంది. ఈ విషయంలో ప్రస్తుతం ఒప్పంద పద్ధతిన పనిచేస్తున్న వారు హైకోర్టును ఆశ్రయించారు. తాము సెమీ అటానమస్ ఆస్పత్రిలో పనిచేస్తున్నామని, 21 చట్టం ప్రకారం ఆస్పత్రి కమిటీ తమను కొనసాగించాలని పేర్కొంటున్నారు. వైద్యులు లేని సమయంలో ఇక్కడ సేవలు అందించామని, ఎన్ఎంసీ తనిఖీకి వచ్చిన సమయంలో తామే దిక్కుగా ఉన్నామని, ఇప్పుడు తమను తొలగించడం ఎంతవరకు సబబని అంటున్నారు. అయితే కొంత మంది రెగ్యులర్ వైద్యులు తాము 30 ఏళ్లుగా సేవలు అందిస్తున్నా ఇప్పటివరకు పదోన్నతి లభించలేదని, ప్రస్తుతం ప్రభుత్వం ప్రమోషన్ కల్పిస్తే అడ్డుకోవడం సరికాదని చెబుతున్నారు. కాంట్రాక్ట్ ప్రొఫెసర్లు కొన్నేళ్లలోనే ఆ స్థాయిని పొందారని పేర్కొంటున్నారు. అయితే కోర్టు తీర్పుతో ఎవరు కొనసాగుతారనేది స్పష్టం కానుంది.

కోర్టును ఆశ్రయించిన వైనం..
రిమ్స్‌లో 21 విభాగాలకు గాను 13 విభాగాల్లో కాంట్రాక్ట్ ప్రొఫెసర్లు పనిచేస్తున్నట్లు సమాచారం. ఇటీవల ప్రభుత్వం తొమ్మిది విభాగాల్లో ప్రొఫెసర్లను నియమించింది. అయితే వీటిలో ఎంత మంది విధుల్లో చేరుతారు.. ఎంత మంది చేరరనే దానిపై స్పష్టత లేదు. రెగ్యులర్ ప్రొఫెసర్లను నియమించడంతో కాంట్రాక్ట్ వైద్యులు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ప్రస్తుతం స్టే విధించగా, తీర్పు వెలువడాల్సి ఉంది. ఈ నేపథ్యంలో పదోన్నతి పొందిన ప్రొఫెసర్లు, కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న వారిలో ఆందోళన వ్యక్తమవుతుంది.

రెగ్యులర్ పోస్టుల కేటాయింపు..
రాష్ట్ర వ్యాప్తంగా పలు వైద్య కళాశాలల్లో ప్రొఫెసర్ పోస్టులను పదోన్నతిపై భర్తీ చేసిన ప్రభుత్వం రిమ్స్‌లో తొమ్మిది రెగ్యులర్ పోస్టులను కేటాయించింది. వీటిలో ఆప్తమాలజీ, ఈఎన్‌టీ, పీడియాట్రిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, అనస్తీషియా, గైనిక్, రేడియాలజీ, పాథాలజీ విభాగాల్లో ప్రొఫెసర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

అందుబాటులో ఉండేనా..
ప్రభుత్వం రిమ్స్‌కు కేటాయించిన రెగ్యులర్ ప్రొఫెసర్ పోస్టుల్లో ప్రస్తుతం కాంట్రాక్ట్ పద్ధతిన వైద్యులు పనిచేస్తున్నారు. అయితే రెగ్యులర్ వైద్యులు చేరిన తర్వాత అందుబాటులో ఉండకపోతే రోగుల పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొంత మంది ఇక్కడ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొంది డిప్యూటేషన్, సెలవుల్లో వెళితే రోగులకు వైద్యసేవలు అందకుండాపోతాయని, భవిష్యత్తులో అసోసియేట్ ప్రొఫెసర్లను భర్తీ చేస్తే తమ పోస్టులు కూడా లేకుండా పోతాయని కాంట్రాక్ట్ వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్లుగా రిమ్స్‌లో సేవలు అందిస్తున్నామని, సెమీఅటానమస్‌గా ఉన్న రిమ్స్‌లో పోస్టులను భర్తీ చేసే విషయం, లేక ఉన్నవారినే కొనసాగించేది రిమ్స్ కమిటీ చేతిలో ఉంటుందని చెబుతున్నారు. కోర్టు తీర్పు వెలువడేంత వరకు ప్రస్తుతం ఉన్న వైద్యులతోనే సేవలు కొనసాగించనున్నారు.

కాంట్రాక్ట్ ప్రొఫెసర్లు కోర్టుకెళ్లారు..
కాంట్రాక్ట్ ప్రొఫెసర్లు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు స్టే విధించింది. ఇప్పటివరకు రెగ్యులర్ ప్రొఫెసర్లు విధుల్లో చేరలేదు.
– జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్

'ఫేస్'తోనే ఇక పింఛన్

- ముఖ గుర్తింపు అమలుకు ప్రభుత్వం కసరత్తు
- నేడు బీపీఎంలకు శిక్షణ
- ఆగస్టు నుంచి అమల్లోకి..
- అక్రమాలకు చెక్ పెట్టేలా చర్యలు



కైలాస్‌నగర్: చేయూత పథకం కింద అందిస్తున్న పింఛన్ల పంపిణీలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం ఫేస్ రికగ్నిషన్(ముఖ గుర్తింపు) అనే ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ విధానం అమలుపై సెర్ప్ పెన్షన్ విభాగం డీపీఎం, ఏపీఎంలకు హైదరాబాద్‌లో ఇప్పటికే ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. గ్రామాల వారీగా పంపిణీ చేసే పోస్టల్ శాఖకు సంబంధించిన బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్(బీపీఎం)లకు శనివారం జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విధానం ఆగస్టు నుంచి అమల్లోకి రానుంది.

అక్రమాలకు చెక్
మున్సిపాలిటీల్లో పింఛన్‌ను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ చేస్తున్నారు. అయితే ఎవరైనా లబ్ధిదారు మరణిస్తే కుటుంబ సభ్యులు సంబంధిత అధికారులకు సమాచారం అందించాల్సి ఉంటుంది. డెత్ సర్టిఫికెట్ ఇచ్చినట్‌లైతే సదరు లబ్ధిదారునికి అందించే పింఛన్ నిలిచిపోతుంది. కానీ అలా జరగడం లేదు. పింఛన్‌దారులు మరణించినా డబ్బులు మాత్రం వారి ఖాతాల్లో జమ అవుతున్నాయి. వాటిని కొంతమంది ఏటీఎం ద్వారా డ్రా చేసుకుంటున్నారు. గతంలో ఇలాంటి సంఘటనలు పలు చోట్ల చోటు చేసుకున్నాయి. అలాగే పలుచోట్ల పంచాయతీ కార్యదర్శులు మరణించిన లబ్ధిదారుల పింఛన్ కాజేసిన ఘటనలు సైతం చోటు చేసుకున్నాయి. ఇలాంటి వాటికి చెక్ పెట్టే దిశగా ప్రభుత్వం ఫేస్ రికగ్నిషన్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

ఇబ్బందులు దూరం ..
ప్రస్తుతం బయోమెట్రిక్ ద్వారా పింఛన్ల పంపిణీ చేపడుతున్నారు. లబ్ధిదారుల్లో అత్యధికులు వృద్ధులు, దివ్యాంగులే. వీరిలో 60 నుంచి 80 ఏళ్ల దాటిన వారి చేతి వేళ్ల కొనలు అరిగిపోయి వేలిముద్రలు పడటం లేదు. దీంతో పింఛన్ల పంపిణీలో సమస్యలు తలెత్తుతున్నాయి. పంచాయతీ కార్యదర్శులు తమ వేలిముద్రల ఆధారంగా పింఛన్లు అందజేస్తున్నప్పటికీ పదేపదే తిరగాల్సి వస్తుంది. ఇలాంటి సమస్యను దూరం చేసేలా ప్రభుత్వం ఫేస్ రికగ్నిషన్ యాప్‌ను తీసుకొచ్చింది. ఆధార్‌కు ఫొటో అనుసంధానమైన లబ్ధిదారులను స్మార్ట్‌ఫోన్‌లో ఫొటో తీయగానే వారి వివరాలు ప్రత్యక్షమై పేమెంట్ మోడల్‌లోకి వెలుతుంది. దీంతో సత్వరం నగదు పొందే అవకాశముంది. ఈ యాప్‌తో కూడిన అధునాతన స్మార్ట్‌ఫోన్లను జిల్లాలోని 250 మంది బీపీఎంలకు అందజేసేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈమేరకు శనివారం వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.

ఇదీ పరిస్థితి ..
వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత, చేనేత కార్మికులు, బీడీ వర్కర్లతో పాటు హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు (1,012), ఫైలేరియా బాధితులు (645) డయాలిసిస్ రోగులు (78)లు చేయూత పథకం కింద పింఛన్ పొందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని కేటగిరీలు కలిపి 75,564 మంది లబ్ధిదారులున్నారు. వీరికి ప్రతి నెలా రూ.19 కోట్ల 51లక్షల 27వేల 790లను చెల్లిస్తోంది. ఇందులో దివ్యాంగులకు రూ.4,016, ఇతరులకు రూ.2,016లను అందజేస్తోంది.

జిల్లాలో ఆయా కేటగిరీల పింఛన్ లబ్ధిదారుల వివరాలు

వృద్ధులు	30,247
వితంతువులు	28,654
దివ్యాంగులు	6,986
గీత కార్మికులు	41
చేనేత కార్మికులు	19
ఒంటరి మహిళలు	2,241
బీడీ కార్మికులు	5,562

ఆగస్టు నుంచి అమలు
పింఛన్ పంపిణీలో పారదర్శకత తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఫేస్ రికగ్నిషన్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. అమలుపై డీపీఎం, ఏపీఎంలకు హైదరాబాద్‌లో ఇప్పటికే శిక్షణ ఇవ్వగా శనివారం బీపీఎంలకు శిక్షణ ఇచ్చే ఏర్పాట్లు చేశాం. వారికి స్మార్ట్ ఫోన్లను ప్రభుత్వమే అందించనుంది. ఆగస్టు నుంచి నూతన విధానంలో పింఛన్ అందించే అవకాశముంది.
– రాథోడ్ రవీందర్, డీఆర్డీవో

ఫలించిన ఎనిమిదేళ్ల న్యాయ పోరాటం

- రిటైర్మెంట్ ప్రయోజనాలపై హైకోర్టును ఆశ్రయించిన సీసీఐ ఉద్యోగులు
- వడ్డీతో సహా చెల్లించాలని న్యాయస్థానం ఆదేశం

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని సీసీఐ యాజమాన్యం జారీ చేసిన ఉత్తర్వులపై ఆ సంస్థలో పనిచేసిన ఉద్యోగులు చేసిన న్యాయ పోరాటం ఎట్టకేలకు ఫలించింది. సీసీఐని మూసివేస్తూ 2017లో ఉత్తర్వులు జారీ చేసిన మేనేజ్‌మెంట్ 2008 సంవత్సరం వరకే ఉద్యోగులకు రిటైర్మెంట్, వాలంటరీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేస్తామని స్పష్టం చేసింది. అయితే తమకు అన్యాయం జరుగుతుందని భావించిన ఉద్యోగులు సంస్థ జారీ చేసిన ఉత్తర్వులపై హైకోర్టును అదే సంవత్సరంలో ఆశ్రయించారు. అప్పటి నుంచి కోర్టులో కేసు నడుస్తుంది. కాగా ఉద్యోగులకు రిటైర్మెంట్, వాలంటరీ రిటైర్మెంట్ ప్రయోజనాలను 2008 నుంచే వడ్డీతో సహా చెల్లించాలని సూచిస్తూ హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు సీసీఐ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ తెలిపారు. ఎనిమిదేళ్ల న్యాయ పోరాటం ఫలించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. కోర్టు తీర్పును స్వాగతిస్తూ శుక్రవారం సీసీఐ కార్యాలయంలో సంబరాలు జరుపుకున్నారు.



పరస్పరం మిఠాయిలు తినిపించుకుంటూ..

డీఆర్డీఏలో భారీగా బదిలీలు

- 24 మంది ఏపీఎంలకు స్థానచలనం
- పోస్టింగ్ ఉత్తర్వులు జారీచేసిన కలెక్టర్

కైలాస్‌నగర్: జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలో ఏళ్లుగా ఒకే చోట పనిచేస్తున్న ఏపీఎంలకు ఎట్టకేలకు స్థానచలనం కలిగింది. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం 24 మంది ఏపీఎంలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో ఐదుగురిని డీఆర్డీఏ కార్యాలయానికి, ఇద్దరిని సీప్ బ్లాక్‌లకు బదిలీ చేశారు. మిగతా 17 మందికి మండలాలకు బదిలీ చేస్తూ పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఆరుగురు ఇతర జిల్లాల నుంచి ఇక్కడకు రాగా జిల్లా నుంచి మరో ఆరుగురు ఇతర జిల్లాలకు బదిలీ అయ్యారు. ఈ ప్రక్రియలో డీఆర్డీవో రాథోడ్ రవీందర్, అదనపు డీఆర్డీవో జాదవ్ గోవింద్‌రావు, సెర్ప్ హెచ్‌ఆర్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎం	ప్రస్తుతం పని చేస్తున్నది	బదిలీ అయిన ప్రాంతం
ఎం.రవీందర్	తాంసి	భీంపూర్
కె.పద్మావతి	డీఆర్డీఏ కార్యాలయం	డీఆర్డీఏ కార్యాలయం
షద్దోద్దీన్	ఆదిలాబాద్ రూరల్	డీఆర్డీఏ కార్యాలయం
ఆర్.స్వామి	తలమడుగు	డీఆర్డీఏ కార్యాలయం
బి.సంతోష్‌కుమార్	సిరికొండ	డీఆర్డీఏ కార్యాలయం
టి.శ్రీనివాస్	డీఆర్డీఏ కార్యాలయం	డీఆర్డీఏ కార్యాలయం
పి.గణేశ్	బజార్‌హత్నూర్	ఎస్‌వీఈపీ బోథ్
ఆర్.రామారావు	ఇంద్రవెల్లి	ఉట్నూర్
కె.ప్రసాద్‌రాజ్	భీంపూర్	మావల
పి.మాధవరావు	బోథ్	ఎస్‌వీఈపీ ఉట్నూర్
పి.అనిల్	ఉట్నూర్	ఆదిలాబాద్ రూరల్
ఎన్.భగవాండ్లు	గుడిహత్నూర్	తాంసి
జే.సుజాత	ఇచ్చోడ (ఎఫ్‌పీసీ)	గుడిహత్నూర్
టి.దయాకర్	ఇచ్చోడ	బేల
జి.రాజచంద్రశేఖర్	మావల	తలమడుగు
బి.జగదీశ్వర్	ఆసిఫాబాద్	ఇచ్చోడ
ఏ.కవిత	డీఆర్డీఏ కార్యాలయం	జైనథ్
కె.లీలారాణి	జైనథ్	నేరడిగొండ
జి.వెంకట్ రెడ్డి	సిర్పూర్	బజార్‌హత్నూర్
కె.కిరణ్ కుమార్	డీఆర్డీఏ కార్యాలయం	సిరికొండ
కె.మంజుల	భూపాలపల్లి	ఇంద్రవెల్లి
జాడి రాజారాం	కడెం	నార్నూర్
డి.దేవానందం	చింతలమానేపల్లి	గాదిగూడ
రతన్‌సింగ్	జయశంకర్‌భూపాలపల్లి	బోథ్

దంచి కొట్టలే..

- జిల్లాలో మోస్తరు వానలే!
- ఈ సీజన్‌లో పరిస్థితి 'సాధారణ'మే
- పంటలకు పర్వాలేదంటున్న రైతాంగం



జిల్లాకు 'రెడ్.. ఆరంజ్ అలర్ట్' అంటూ ఇటీవల వాతావరణ శాఖ నుంచి అందుతున్న సమాచారం. అయితే క్షేత్రస్థాయి పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. జిల్లా వ్యాప్తంగా గడిచిన ఐదు రోజులుగా నమోదైన వర్షపాత వివరాలే ఇందుకు నిదర్శనం. ఈ నెల 25న 10 మి.మీ.లు నమోదు కాగా 24న 26.8 మి.మీ.లు, 23న 2.0 మి.మీ.లు, 22న 7.4 మి.మీ.లు, 21న 0.0 మి.మీ. సగటు వర్షపాతం నమోదైనట్లు తెలుస్తోంది. ఈలెక్కలను పరిశీలిస్తే ఓ మోస్తారు వర్షాలే అని చెప్పవచ్చు.

సాక్షి, ఆదిలాబాద్: రాష్ట్రంలో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అన్నిచోట్ల జలాశయాలు నిండుకుండల్లా తయారయ్యాయి. అయితే జిల్లాలో పరిస్థితులు మాత్రం ఇందుకు భిన్నంగా ఉన్నాయి. కొద్ది రోజులుగా జిల్లాకు రెడ్, ఆరెంజ్ అలర్ట్ అంటూ వాతావరణ శాఖ నుంచి కూడా సూచనలు జారీ అయ్యాయి. దీంతో భారీ వర్షాలు కురుస్తాయని అంతా భావించారు. ఒకవేళ వరదలు వస్తే అందుకు సిద్ధంగా ఉండాలని యంత్రాంగం కూడా సిద్ధమైంది. కంట్రోల్‌రూమ్ కూడా ఏర్పాటు చేసింది. అయితే జిల్లాలో ఇప్పటివరకు దంచికొట్టిన వానలే లేవు. నాలుగైదు రోజులుగా ఓ మోస్తారు వర్షాలే కురుస్తున్నాయి. అయితే వాతావరణం పూర్తిగా చల్లబడింది. ఎప్పుడైనా జోరవాన కురిసే అవకాశం ఉందని జనం భావిస్తున్నారు.

పూర్తిస్థాయిలో నిండని ప్రాజెక్టులు..
జిల్లాలో రెండు మధ్యతరహా ప్రాజెక్టులు ఉన్నాయి. ఇందులో సాత్నాల ప్రాజెక్టు నీటి సామర్థ్యానికి ఇంకా పూర్తిస్థాయిలో చేరుకోలేదు. మత్తడివాగు ప్రాజెక్టుదీ ఇదే పరిస్థితి. ఇక జిల్లాలో 392 చెరువులు ఉన్నాయి. వాటిలో అధిక శాతం 75 శాతానికి పైగా నిండాయి. అయితే ఎక్కడ కూడా అలుగుపారుతున్న చెరువుల దృశ్యాలు ఇప్పటివరకు లేవు. జూన్ 1 నుంచి వర్షాకాలం మొదలు కాగా, ఆ మాసంలో సాధారణ వర్షపాతం నమోదైంది. జూలైలో భారీ వర్షాలు కురుస్తాయని ఆశించినప్పటికీ ఈనెల చివరి వరకు వచ్చినప్పటికీ మోస్తరుగానే నమోదయ్యాయి. జిల్లాలో వర్షపాతం సాధారణంగా ఉన్నప్పటికీ భారీ వర్షాలు అంతగా లేకపోవడం లోటుగా కనిపిస్తుంది.

పంటలకు ఆశాజనకమే..
మోస్తరుగా కురుస్తున్న వర్షాలు జిల్లాలో పంటలకు మాత్రం ఆశాజనకంగా ఉన్నాయన్న అభిప్రాయం రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు వ్యక్తం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా పత్తి, సోయా, కంది, ఇతరత్రా పంటలు పెద్ద ఎత్తున సాగు చేస్తున్నారు. అధికంగా వర్షాధారంగానే పండిస్తారు. జూన్‌లో సాధారణ వర్షపాతం నమోదు కావడం, జూలైలో కూడా ఇదే పరిస్థితి ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వర్షపాతం వివరాలు (జూన్ 1 నుంచి జూలై 25 వరకు)

సాధారణం	467 మి.మీ.లు
కురిసింది	447.4 మి.మీ.లు
వ్యత్యాసం	– 4 శాతం
స్థితి	సాధారణం

ఆరోగ్యంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

ఇచ్చోడ: ప్రతీ విద్యార్థి ఆరోగ్యంపై దృష్టి సారించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మండలంలోని ముఖరా(బి) ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు చెప్పిన అంశాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. తలసేమి యాతో బాధపడుతున్న శివంగి అనే విద్యార్థినికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ చాబ్రా, జెడ్పీసీఈవో జితేందర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో రాథోడ్‌నరేందర్, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మలేరియా అధికారి శ్రీధర్, తహసీల్దార్ సత్యనారాయణరావు, ఎంపీడీవో సత్యానంద్, ఇచ్చోడ వైద్యాధికారి కిరణ్‌కుమార్, మాజీ సర్పంచ్ మారుతి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సు భాష్, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'49' తెచ్చింది.. అప్పటి ప్రభుత్వాలే!

- కాంగ్రెస్‌కు సంబంధం లేదు..
- జీవో రద్దు చేసేంత వరకు ఉద్యమిస్తాం
- మాజీ ఎంపీ సోయం బాపూరావు



మాట్లాడుతున్న సోయం బాపూరావు

ఆదిలాబాద్‌రూరల్: జీవో 49కి కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని, ఆ జీవోను 2016లో రాష్ట్రంలోని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముసాయిదా తీసుకువచ్చిందని మాజీ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆసిఫాబాద్ ప్రాంతంలో కారిడర్ పేరిట లక్షలాది ఆదివాసీలను నిర్వాసితులు చేసే కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. ఆదివాసీలను ఇబ్బందులకు గురి చేసే జీవో 49 రద్దు చేయాలని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు సీతక్క, జూపల్లిని కలిసి విన్నవించామన్నారు. స్పందించిన వారు ఆ జీవోను తాత్కాలికంగా నిలిపివేశారన్నారు. అయితే గతంలో ఆ జీవోకు మద్దతు ఇచ్చిన అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ, ఎంపీ గోడం నగేశ్ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని మండిపడ్డారు. ఆ జీవో రద్దు చేసేంత వరకు ఢిల్లీస్థాయి వరకు ఉద్యమిస్తామన్నారు. తుడుందెబ్బలోని కొంతమంది నాయకులు డబ్బులకు అమ్ముడుపోయారనే విమర్శలు రావడంతో అందులో నుంచి స్వచ్ఛందంగా తప్పుకున్నానని తెలిపారు. ఆదివాసీ సమస్యలపై పోరాటం చేసేందుకు రాజ్‌గోండ్ సేవా సమితిలో చేరి రాష్ట్ర అధ్యక్షుడిగా నెల 27న ప్రమాణ స్వీకారం చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట సంఘం నాయకులు సిడాం అర్జు, ఆత్రం పరుశురాం, హన్ను పటేల్, శంబు, తానాజీ, ఆనంద్‌రావ్, శ్యాంరావ్, తదితరులున్నారు.

త్వరలో మెగా జాబ్‌మేళా

కైలాస్‌నగర్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగవకాశాలు కల్పించేందు కోసం తెలంగాణ ప్రభుత్వ టాస్క్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో త్వరలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. నిర్వహణ ఏర్పాట్లపై శుక్రవారం రాత్రి తన చాంబర్‌లో పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 20 ఐటీ, నాన్‌ఐటీ కంపెనీల ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా జిల్లా ఉపాధి కల్పన శాఖ కార్యాలయంలో ఈ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. పదో తరగతి నుంచి పీజీ వరకు అర్హత కలిగిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థుల భాగస్వామ్యం పెంచేందుకు సంబంధిత అధికారులు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లు, ఇతర సంస్థల ప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. ఇందులో జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ పద్మభూషణ్ రాజు, డీఆర్డీవో రాథోడ్ రవీందర్, టాస్క్ స్టేట్ ఆర్గనైజర్ ప్రదీప్‌కుమార్, ఉమ్మడి జిల్లా మేనేజర్ సాయికుమార్, డీపీవో రమేష్, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తొమ్మిది కిలోమీటర్లు నడిచి వైద్యసేవలు



కాలినడకన మందులతో వెళ్తున్న కృష్ణ, రేణుక

ఇచ్చోడ: మండలంలోని నర్సాపూర్ పీహెచ్‌సీ హెల్త్‌అసిస్టెంట్ రాథోడ్ కృష్ణ, ఏఎన్‌ఎం రేణుక శుక్రవారం మారుమూల గిరిజన గ్రామాలైన బుర్సిగుట్ట, ధర్మాజీపేట్‌కు సుమారు తొమ్మిది కిలోమీటర్లు కాలినడకన వెళ్లారు. ఆయా గ్రామాల ప్రజలకు వైద్యం అందించారు. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. మరో తొమ్మిది మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. అనంతరం సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఇళ్లు, పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని, చేతిపంపుల నీరే తాగాలని సూచించారు.

ఐటీడీఏ ఇన్‌చార్జి ఏపీఆర్వోగా సంపత్‌కుమార్



పీవోకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సంపత్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఐటీడీఏ ఇన్‌చార్జి ఏపీఆర్వోగా సంపత్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కొన్ని నెలలుగా ఈ పోస్టు ఖాళీగా ఉండగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా డీపీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న సంపత్ కుమార్‌కు ఐటీడీఏ ఇన్‌చార్జి ఏపీఆర్వోగా బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆయన ఐటీడీఏలోని ఏపీఆర్వో ఆఫీస్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పీవో ఖుష్బూ గుప్తాను మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. ఐటీడీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న సంక్షేమ పథకాలపై గిరిజనులను అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

తెగిన చింతగూడ మట్టి రోడ్డు



కొట్టుకుపోయిన రోడ్డు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఘన్‌పూర్ గ్రామపంచాయతీ పరిధి లక్కారం నుంచి చింతగూడకు వెళ్లే మట్టి రోడ్డు వర్షానికి తెగి ప్రమాదకరంగా మారింది. ఇక్కడ పెద్ద గుంత ఏర్పడగా ప్రమాదాలు జరిగే ఆస్కారముంది. అటుగా వెళ్తున్న మాజీ ఎంపీపీ జైవంత్‌రావు స్వయంగా తెగిన రోడ్డు గుంత చుట్టూ బండరాళ్లతో సూచిక ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించి వెంటనే గుంత పూడ్చి రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

రైతన్నా.. జర భద్రం

- రసాయనిక ఎరువులతో జాగ్రత్త
- పిచికారీలో జాగ్రత్తలు తప్పనిసరి
- నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాపాయమే
- అప్రమత్తతే అన్ని విధాలా మేలు

మంచిర్యాలఅగ్రికల్చర్: పురుగుమందులంటేనే అత్యంత ప్రమాదకరమైనవి. అవి మన శరీరంలోకి వెళ్లినా.. వాటి వాసన పీల్చినా ఆరోగ్యానికి హానికరమే. పంటలపై పురుగుమందులు పిచికారీ చేయడంలో అవగాహన లేకపోవడం.. సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో రైతులు, వ్యవసాయ కూలీలు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గతేడాది పంటకు పురుగుమందు పిచికారీ చేసి ఇంటికి వచ్చి విషప్రభావంతో వేర్వేరు చోట్ల నలుగురు మరణించారు. వేర్వేరు ఘటనల్లో మరో 18 మంది అస్వస్థతకు గురయ్యారు. ఇలాంటి ఘటనలు ప్రతీ సీజన్‌లో చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ప్రస్తుతం పత్తి, సోయా, కంది చేన్లకు కలుపు, చీడపీడల నివారణకు రసాయనిక మందులు పిచికారీ చేస్తున్నారు. పంటకు హాని జరుగుతుందన్న ఏమరుపాటులో రైతులు, వ్యవసాయ కూలీలు వ్యక్తిగత జాగ్రత్తలు మరిచిపోతున్నారు. ప్రాణాంతకమైన రసాయనిక మందుల వినియోగం విషయంలో ఏమరుపాటు వద్దని ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త రాజశేఖర్ తెలిపారు. పురుగుమందులు పిచికారీ చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకుంటే మేలని సూచించారు.

మందు ప్రభావానికి గురైతే..

- పురుగుమందు ప్రభావానికి గురైన వ్యక్తి నోట్లో వేలు పెట్టి వాంతి చేయించాలి.



నెన్నెలలో పత్తి చేనులో క్రిమిసంహార మందు పిచికారీ చేస్తున్న రైతు (ఫైల్)

- మూర్ఛపోయిన సందర్భంలో మూతికి గాయం కాకుండా రెండు దవడల మధ్య గుడ్డ ఉంచాలి.
- శరీర ఉష్ణోగ్రతను తగ్గించేందుకు తడిబట్టతో నెమ్మదిగా తుడవాలి. శరీర ఉష్ణోగ్రత బాగా తగ్గితే దుప్పటి కప్పి వెచ్చగా ఉంచాలి. సకాలంలో ఆస్పత్రికి తీసుకువెళ్లాలి. అనారోగ్యానికి కారణమైన రసాయనాల వివరాలు డాక్టర్‌కు తెలుపాలి.

అవసరమైన పరికరాలు వాడాలి

పంటలకు పురుగుమందులు వాడడానికి వ్యవసాయశాఖ సూచించిన స్ప్రేయర్లనే వాడాలి. ముఖ్యంగా పంటలో మొక్కల స్థాయిని బట్టి స్ప్రేయర్లు ఉపయోగించాలి. పత్తిలో హ్యాండ్ స్ప్రేయర్, పవర్ స్ప్రేయర్ల కంటే తైవాన్ స్ప్రేయర్ల ద్వారా మొక్కలకు నేరుగా మందు పిచికారీ చేసే వీలుంటుంది.

పరిమితికి మించి వద్దు

పంటను ఆశించిన తెగుళ్ల, పురుగుల నిర్మూలనకు ఇష్టమొచ్చిన మందులు చల్లితే ఉపయోగం ఉండదు. విష తీవ్రతలో తేడా ఉంటుంది. పిచికారీ చేసేటప్పుడు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా అస్వస్థతకు గురవుతారు. వ్యవసాయశాఖ, శాస్త్రవేత్తలు పెస్టిసైడ్స్ దుకాణాదారులు సూచనలు పాటించాలి. పరిమితికి మించి పంటలకు మందులు పిచికారీ చేస్తే మేలు కన్నా కీడే ఎక్కువగా జరుగుతుంది. జాగ్రత్త వహించకుంటే పంటకు మేలు చేసే సాలీడు, అక్షింతల పురుగులు మృత్యువాత పడతాయి. మిత్ర పురుగులు పొలంలో లేకుంటే పంటకు కీడు చేసే పురుగుల ఉధృతి పెరుగుతుంది.

అవగాహన అవసరం

పంటలను ఆశించే చీడపీడల నివారణకు ఉపయోగించే పురుగు మందులపై రైతుల అవగాహన పెంచుకోవాలి. ముఖ్యంగా పెస్టిసైడ్ దుకాణాల్లో పురుగుమందులు నాలుగు రంగుల్లో లభ్యమవుతాయి. వీటిలో పుర్రె గుర్తుతో ఉన్న రంగు, ఆకుపచ్చ, నీలి, పసుపు రంగులతో కూడిన డబ్బాలుంటాయి. పుర్రె గుర్తుతో కూడి ఎర్ర రంగు ఉంటే అత్యంత విషపూరితమని గుర్తించాలి. ఆకుపచ్చ రంగు చిహ్నంతో ఉంటే తక్కువ విషపూరితమని తెలుసుకోవాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పురుగు మందు డబ్బా మూత నోటితో తీయవద్దు. మందు ద్రావణాన్ని చేతితో కలపద్దు.
- మందు ఒకేసారి సరిపడా కలుపుకోవాలి.
- పవర్ స్ప్రేయర్ నాజిల్‌ను పెద్దగా చేయరాదు. పిచికారీ సన్నగా, తుంపరలా ఉండేలా చూడాలి.
- మందు తగిన మోతాదులోనే పిచికారీ చేయాలి. మోతాదుకు మించితే పంటలకు ప్రమాదం.
- ఒకేసారి రెండు లేదా మూడు రాకల పురుగుమందులు కలిపి పిచికారీ చేయకూడదు.
- చేతులకు గ్లౌస్‌లు, కళ్లద్దాలు, ముఖానికి మాస్క్, తలకు టోపీ లేదా రుమాలు తప్పనిసరిగా ధరించాలి. చేతి వేళ్లకు గోళ్లు పెంచుకోకూడదు. పత్తిలో అయితే కాళ్లకు బూట్లు ధరించాలి.
- ఉదయం, సాయంత్రం గాలి ఎదురుగా వచ్చే టప్పుడు పురుగుమందు పిచికారీ చేయకూడదు. గాలి వీస్తున్న వైపే వెళ్తూ పిచికారీ చేయాలి.
- పురుగుమందు పిచికారీ చేసే సమయంలో పొగ తాగరాదు. పొగాకు ఉత్పత్తులు, గుట్కాలు తిన వద్దు. చేతులు నోట్లో పెట్టుకోవడం, కళ్లు నలుచుకోవడం లాంటి పనులు అస్సలు చేయొద్దు.
- పంట ఏపుగా పెరిగి ఉంటే చేతిపంపుతో కాకుండా స్ప్రేయర్‌తోనే పిచికారీ చేయాలి.
- కొన్ని రకాల పురుగుమందులు మాత్రం పవర్ స్ప్రేయర్‌తో పిచికారీ చేయకూడదు. స్ప్రేయర్‌తో పిచికారీ చేస్తే మందు గాలిలో కలిసి ఇతర పంట లపై పడితే పంట నాశనమై పోతుంది. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి.
- గాయాలైన చేతులతో మందు పిచికారీ చేయరాదు. పిచికారీ పూర్తియిన వెంటనే కాళ్లు, చేతులు సబ్బుతో కడుక్కోవాలి. తలస్నానం చేయాలి.
- పిచికారీ చేసేటప్పుడు ప్రత్యేకమైన దుస్తులు మాత్రమే ధరించాలి. వాటిని విడిచిన తర్వాత మిగతా దుస్తులతో కలిపి శుభ్రం చేయొద్దు.
- చిన్నపిల్లలకు పురుగుమందులను సాధ్యమైనంత దూరంగా ఉంచేలా జాగ్రత్త పడాలి.
- పిచికారీ అనంతరం వినియోగించిన పురుగు మందు డబ్బాలను గోతి తీసి పాతిపెట్టాలి.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన బాలెరావ్ కపిల్ (26) రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీస్ ఇన్‌చార్జి ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కపిల్‌కు నాలుగేళ్ల క్రితం వివాహం కాగా, గతేడాది భార్యకు విడాకులిచ్చాడు. మద్యానికి బానిసై ఏ పనీ చేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. ఈక్రమంలో కుటుంబీకులు గురువారం రాత్రి మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన కపిల్ తిరిగి రానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబీకులు అతడి కోసం చుట్టుపక్కలా గాలించినా ఆచూకీ లభించలేదు. రాత్రి 12.15 గంటలకు ఆర్డీవో కార్యాలయం ఎదుట గల రైల్వే ట్రాక్‌పై పూర్ణ నుంచి ఆదిలాబాద్‌కు వచ్చే రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్రభాకర్ తెలిపారు.

దేగామలో పురుగుల మందు తాగి..



నిఖిల్ (ఫైల్)

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ గ్రామానికి చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సంజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. తీగల శ్రీనివాస్–లక్ష్మి కుమారుడు నిఖిల్ (22) బోథ్ మండలానికి చెందిన యువతిని ప్రేమించాడు. ఇటీవల ఇద్దరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. దీంతో మనస్తాపం చెందిన నిఖిల్ ఈనెల 20న రాత్రి తన ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు నిఖిల్‌ను ఆదిలాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేతేశ్వర కంకాలమ్మ ఆలయంలో చోరీ

జన్నారం: మండల కేంద్రంలోని కేతేశ్వర కంకాలమ్మ ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరగగా, నిందితుడిని అరెస్ట్ చేసినట్లు లక్సెట్టిపేట సీఐ రమణమూర్తి, ఎస్సై అనూష తెలిపారు. శుక్రవారం వారు తెలిపిన వివరాల ప్రకారం.. కేతేశ్వర కంకాలమ్మ ఆలయంలో చోరీ జరిగినట్లు శుక్రవారం ఆలయ పూజారి రేగుంట భూమయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సై అనూష కేసు నమోదు చేశారు. పోలీసులు నాలుగు బృందాలుగా వీడి దర్యాప్తు ప్రారంభించారు. కాగా, మూడు గంటల్లోనే నిందితుడిని గుర్తించారు. జన్నారం మండలం పొనకల్ గ్రామానికి చెందిన కొండపల్లి అశోక్ చోరీకి పాల్పడినట్లు గుర్తించి అతడిని అరెస్ట్ చేశారు. అతడి నుంచి రూ.300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. మూడు గంటల్లోనే కేసు ఛేదించిన సీఐ రమణమూర్తిని, ఎస్సై అనూష, కానిస్టేబుళ్లు తుకారాం, సంతోష్, శ్రీనివాస్‌ను ఏసీపీ ప్రకాశ్, డీసీపీ భాస్కర్ అభినందించారు.



నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ, ఎస్సై

తప్పిపోయిన బాలుడి అప్పగింత

బెల్లంపల్లి: తప్పిపోయిన బాలుడిని పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. బ్లూకోల్ట్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ వలస కూలీలు బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ఆవరణలో నిర్వహి స్తున్న పనులకు వచ్చారు. ఇందులో రాజ్‌బతి–ప్రేమ్‌లాల్ దంపతులు ఉండగా వీరికి ఇద్దరు పిల్లలున్నారు. శుక్రవారం పిల్లలను ఇంటి వద్ద ఉంచి కాంటా చౌరస్తాలోని మార్కెట్‌కు కూరగాయల కోసం వచ్చారు. వీరి ఐదేళ్ల కుమారుడు సుమిత్ తల్లిదండ్రులను వెతుక్కుంటూ రైల్వేస్టేషన్ ఏరియా నుంచి ఏఎంసీ ఏరియా వరకు వచ్చాడు. తల్లిదండ్రులు కనిపించకపోవడంతో చౌరస్తాలో ఏడుస్తుండగా కొందరు గమనించి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈమేరకు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో శ్రీనివాసరావు సూచన మేరకు బ్లూకోల్ట్స్ సిబ్బంది రామ్‌ప్రసాద్, ప్రవీణ్‌కుమార్ బైక్‌పై ఆ బాలుడిని ఎక్కించుకుని మున్సిపల్ వార్డులన్నీ కలియదిరిగారు. చివరకు అంబేడ్కర్‌నగర్ బస్తీకి వెళ్లగా అప్పటికే ఆ ప్రాంతంలో వెతుకుతున్న అతడి తల్లిదండ్రులు కనిపించారు. బ్లూకోల్ట్స్ సిబ్బంది వలస కూలీలను విచారించి ఆ బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో పోలీసులకు బాలుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



బాలుడితో తల్లిదండ్రులు, పోలీసులు

మంత్రి పీఏపై బీఆర్‌ఎస్ నాయకుల ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చెన్నూర్: మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై తప్పుడు వార్తలను సోషల్ మీడియాలో పోస్టు చేసిన కార్మికశాఖ మంత్రి వివేక్ పీఏ రమణారావుపై శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సుబ్బారావుకు ఫిర్యాదు చేసినట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజారమేశ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో న్యూస్ పేపర్లలో వచ్చిన వార్తలను సోషల్ మీడియాలో ఫార్వర్డ్ చేసిన బీఆర్‌ఎస్ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారని గుర్తు చేశారు. మంత్రి పీఏగా ఉన్న రమణారావు దళితనేతపై తప్పుడు ప్రచారం చేసినందుకు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేయకుంటే రామగుండం సీపీకి ఫిర్యాదు చేసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నవాజ్, మాజీ సర్పంచ్ కృష్ణ, నాయకులు సాంబగౌడ్, మేడ సురేశ్‌రెడ్డి, కొప్పుల రవీందర్, మహేందర్, జడల మల్లేశ్, నాయబ్, బోగె భారతి తదితరులున్నారు.

తేజకళ్యాణికి నియామకపత్రం



తేజకళ్యాణికి నియామకపత్రం ఇస్తున్న సీతక్క

లక్సెట్టిపేట: పట్టణంలోని మహాలక్ష్మీవాడకు చెందిన కూడెల్లి తేజకళ్యాణి ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన టీఎస్‌పీఎస్‌సీ ఫలితాల్లో ఐసీడీఎస్ సీడీపీవోగా ఎంపికై శుక్రవారం సచివాలయంలో మంత్రి సీతక్క చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. తేజకళ్యాణి తండ్రి సత్యనారాయణ ప్రభుత్వ ఉపాధ్యాయుడు, తల్లి స్వరూపారాణి గృహిణి. తేజకళ్యాణి పట్టణంలోని ట్రినిటి పాఠశాలలో ఎనిమిదో తరగతి వరకు చదువుకున్నారు. కాగజ్‌నగర్‌లోని నవోదయ సీటు రాగా అందులో పదో తరగతి వరకు, హసన్‌పర్తిలో ఇంటర్, హైదరాబాద్‌లో డిగ్రీ, ఎన్‌ఐఎన్‌లో పీజీ పూర్తి చేశారు. తేజకళ్యాణిని పలువురు అభినందించారు.

ద్విచక్ర వాహనం చోరీ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రవెల్లిలోని శివాజీనగర్‌కు చెందిన టేక్లె కృష్ణ ద్విచక్ర వాహనాన్ని ఆయన స్నేహితుడు గైక్వాడ్ కృష్ణ గురువారం ఆదిలాబాద్‌కు తీసుకువచ్చాడు. కృష్ణ భార్య రిమ్స్‌లో డెలివరీ కాగా ఆస్పత్రికి వచ్చిన అతడు బైక్ అక్కడ పార్కింగ్ చేశాడు. ఉదయం బైక్ కనిపించలేదు. దీంతో టూటౌన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇరువర్గాలపై కేసు

సాత్నాల: లారీ బైక్‌ను ఢీకొనగా లారీ డ్రైవర్‌పై ఆకుర్ల గ్రామస్తులు దాడికి పా ల్పడ్డారు. ఎస్సై గౌతమ్ పవర్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఆదిలా బాద్ నుంచి పట్టి లేజర్ లోడుతో బేలాకు వెళ్తున్న లారీ తర్నం బ్రిడ్జి వద్ద ముందుగా వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఆకుర్ల గ్రామానికి చెందిన రాహుల్, పాండురంగకు స్వల్ప గాయాలయ్యాయి. తమ గ్రామస్తులకు గాయాలయ్యాయనే కోపంతో నితీశ్, దత్తు లారీ డ్రైవర్ షేక్ ఫిరోజ్‌పై దాడికి దిగారు. దీంతో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నాలుగు దశాబ్దాలకు భూసమస్య పరిష్కారం

భీమిని: నాలుగు దశాబ్దాలుగా కుటుంబ తగాదాలతో జఠిలంగా మారిన భూసమస్యను బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ శుక్రవారం పరిష్కరించారు. వివరాలు.. కన్నెపల్లి మండలం జజ్జరవెల్లి గ్రామపంచాయతీకి చెందిన తాళ్లపల్లి పోచయ్య–రుక్మబాయికి నలుగురు కుమారులు నానయ్య, శంకర్, రామయ్య, లింగయ్య ఉన్నారు. పోచయ్య పేరిట సుమారు 84 ఎకరాల భూమి ఉంది. పోచయ్య కుమారులకు వివాహాలు కాగా, మనుమలు, మనుమరాళ్లు కూడా ఉన్నారు. అయినప్పటికీ కుటుంబ తగాదాలతో భూమి పంపకాలు కాలేదు. ఇటీవల భూభారతిలో పోచయ్య వారసులు వారసత్వ భూములు తమ పేరిట రిజిస్ట్రేషన్లు చేయాలని అర్జీలు పెట్టుకున్నారు. దీంతో రెవెన్యూ అధికారులు నోటీసులు అందజేసి సర్వే డిపార్ట్‌మెంట్ వారితో కలిసి మోఖా సర్వే చేపట్టారు. అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. కాగా, పోచయ్య వారసులకు కుటుంబ తగాదాలు ఉండటంతో శుక్రవారం జజ్జరవెల్లి గ్రామపంచాయతీలో కుటుంబ సభ్యులందరి వాంగ్మూలం తీసుకున్నారు. గ్రామస్తుల సమక్షంలో ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ శ్రవణ్‌కుమర్, డీఐ నజీరుద్దీన్, పంచాయతీ కార్యదర్శి శ్రీజ విచారణ జరిపించారు. పోచయ్య వారసులందరితో మాట్లాడి భూమి పంపకాలు చేసి సమస్య పరిష్కరించారు.



పోచయ్య వారసులు, గ్రామస్తులతో ఆర్డీవో హరికృష్ణ

పాలనురగల 'కోర్టికల్'



ఆదిలాబాద్ జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో నేరడిగొండ మండలంలోని కోర్టికల్ జలపాతం జలకళను సంతరించుకుంది. పాలనురగలను తలపించేలా నీరు ప్రవహిస్తూ పర్యాటకులను పరవశింపజేస్తోంది. జాతీయ రహదారి 44 సమీపంలోనే ఉండడంతో ఇటుగా వెళ్లే వాహనదారులు, ప్రజలను ఆకట్టుకుంటోంది.
– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

బాసరలో 'శ్రావణ' సందడి

బాసర: బాసరలో 'శ్రావణ' సందడి మొదలైంది. శ్రావణమాసం తొలి శుక్రవారం కావడంతో శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలతోపాటు పొరుగునే ఉన్న మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు అధికసంఖ్యలో వచ్చారు. ముందుగా పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలాచరించారు. అనంతరం సరస్వతీ, మహాలక్ష్మి, మహాకాళి అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు, వేదపండితులు వేకువజామున వేద మంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి నిత్య అభిషేకం, హారతి, గణపతి పూజ, కలశపూజ, కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అక్షరాభ్యాస మండపంలో తల్లిదండ్రులు చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కుంకుమార్చన పూజలు జరిపించారు. అమ్మవారి దర్శనానికి గంట సమయం పట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ అధికారులు, పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గ్రామాల్లో 'ఎక్సైజ్' గ్రామసభలు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఉట్నూర్, లింగోజీతండా, లక్కారం, హర్కాపూర్ గ్రామాల్లో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సంబంధిత గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారి సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. పరిశీలకులుగా మెస్రం మనోహర్, ఏటీడీవో క్రాంతి వ్యవహరించారు. ఏజెన్సీ ప్రాంతంలోని గ్రామపంచాయతీల్లో వైన్‌షాపుల ఏర్పాటుకు తీర్మానాలు చేసినట్లు ప్రత్యేక పరిశీలనాధికారి మనోహర్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది ఏజెన్సీ గ్రామాలు, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఐదు గ్రామాలను కలుపుకొని 14 గ్రామపంచాయతీల్లో ఈ నెల 25, 26 తేదీల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎక్సైజ్ ఉట్నూర్ బ్రాంచ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రూప్‌సింగ్, ఎస్సై కష్ణకుమార్, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రత్యేక పరిశీలనాధికారి మనోహర్

ఆర్జీయూకేటీ విద్యార్థులకు అవగాహన

బాసర: బాసర ఆర్జీయూకేటీలో నూతన ఆవిష్కరణల పరిరక్షణకు మార్గనిర్దేశం చేయడమే లక్ష్యంగా 'అవగాహన మేధస్సుకు రక్షణ' అనే అంశంపై కళాశాల అధికారులు ఇంజినీరింగ్ విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పేటెంట్ దాఖలాలు, కాపీరైట్స్, డిజైన్ రిజిస్ట్రేషన్, పేటెంట్ డ్రాఫ్టింగ్ తదితర ముఖ్యాంశాలపై డాక్టర్ దాసరి అయోధ్య వివరించారు. డాక్టర్ సాజిబ్ కేపీ పాల్ మాట్లాడుతూ.. మేధో సంపత్తి హక్కులు (ఐపీఆర్), భారతదేశ ఐపీ చట్టాలు, ఐపీఆర్ ప్రధాన విభాగాల గురించి తెలిపారు. సమాచారం, దరఖాస్తు ఫారాల రకాలు, దరఖాస్తును వేగంగా ప్రాసెస్ చేసుకునే వ్యూహాలు, ఫీజు నిర్మాణాల గురించి వివరించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేటెంట్ల కోసం ఆన్‌లైన్‌లో ఎలా దరఖాస్తు చేయాలో తెలిపారు. పేటెంట్ శోధనలు ఎలా నిర్వహించాలో మార్గనిర్దేశం చేశారు. డ్రాయింగ్, సాంకేతికంగా ఎలా రాయాలో, ఎలా రూపొందించాలో అవగాహన కల్పించారు. భారతదేశం డబ్ల్యూటీవో (ప్రపంచ వాణిజ్య సంస్థ) స్థాపక సభ్యులుగా ఉన్నప్పటికీ దేశంలోని చాలా విశ్వవిద్యాలయాల్లో ట్రేడ్, ఆవిష్కరణలపై ప్రత్యేక కోర్సులు అందుబాటులో లేవని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉత్పత్తులకు మార్కెట్లో గుర్తింపు లేని దుస్థితి ఉందని తెలిపారు. సెమీ కండక్టర్ ఉత్పత్తుల ప్రాధాన్యత, ఫ్యాన్సీ ఐస్‌క్రీమ్‌లు, కుకీస్ ప్యాకేజింగ్ మార్కెటింగ్, ఐపోస్, అలెక్సా ఆధారిత హోటల్, స్మార్ట్ లైటింగ్ లాంటి అనేక వాటిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అధికారులు సూచించారు. త్వరలో విశ్వవిద్యాలయంలో ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభించనున్నట్లు కళాశాల వీసీ గోవర్ధన్ ప్రకటించారు. 'ఉత్పత్తుల అభివృద్ధి, మార్పుల ఆవశ్యకతలు, మార్కెట్ డిమాండ్లను గమనిస్తూ మార్పులు చేయగల సామర్థ్యం కలిగిన మేధావులను సిద్ధం చేయాలని సూచించారు. అసోసియేట్ డీన్‌లు డాక్టర్ విఠల్, డాక్టర్ మహేశ్, కోఆర్డినేటర్ డాక్టర్ కాశన్న, సభ్యులు డాక్టర్ అజయ్ రెవెల్లి, డాక్టర్ రాకేశ్ రోషన్, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్



పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

మందమర్రిరూరల్: ప్రతీ ఉద్యోగి రక్షణ సూత్రాలు పాటించాలని హైదరాబాద్ రీజియన్–2, సౌత్ సెంట్రల్ జోన్ డైరెక్టర్ ఆఫ్ మైనింగ్ సేఫ్టీ (డీజీఎం, మైనింగ్) నాగేశ్వర్‌రావు సూచించారు. శుక్రవారం ఏరియాలోని ఎల్లందు క్లబ్ ఆవరణలో సింగరేణి సేఫ్టీ జీఎం (కార్పొరేట్) చింతల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన త్రైపాక్షిక రక్షణ సమీక్షకు సింగరేణి డైరెక్టర్ (పీపీ) వెంకటేశ్వర్లుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ ఏరియాలోని గనుల్లో రక్షణపై వివరించారు. తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు, సూచనలు చేశారు. అనంతరం డీజీఎం మాట్లాడుతూ.. ఏరియాలో జీరో పర్సంటేజ్ ఆక్సిడెంట్‌గా విధులు నిర్వహించాలని, పని స్థలాల్లో అనుభవజ్ఞులైన వారిని నియమించాలని, ఉద్యోగులు వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణతో విధులు నిర్వహించేలా చూడాలని సూచించారు. డైరెక్టర్ (పీపీ) మాట్లాడుతూ.. రక్షణపై సింగరేణి పకడ్బందీ చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఉద్యోగులు, అధికారులు రక్షణ సూత్రాలు పాటిస్తూ నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. అనంతరం సేఫ్టీ జీఎం (కార్పొరేట్) ప్రమాదాల ని వారణకు చేపడుతున్న చర్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా రక్షణ సూత్రాలు పాటిస్తూ విధులు నిర్వహిస్తామని రక్షణపై ప్రతిజ్ఞ చేశారు. అంతకుముందు ఏరియాలో ప్రమాదాల్లో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. డీఎంఎస్ (ఎలక్ట్రికల్) రాజ్‌కుమార్, డీవై డీఎంఎస్ (మెకానికల్) రాజీవ్ ఓంప్రకాశ్‌వర్మ, డీవై డీఎంఎస్ (మెకానిక్) దిలీప్‌కుమార్, డీవై డీఎంఎస్ (మైనింగ్) ప్రేమ్‌కుమార్, డీడీఎంఎస్ (ఎలక్ట్రికల్) కోమల్‌చౌదరి, డీవై డీఎంఎస్ (మెకానికల్) అనికేత్‌సింగ్, మందమర్రి ఏరియా జీఎం దేవేందర్, బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కరరెడ్డి, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్, రెస్క్యూ జీఎం శ్రీనివాసరెడ్డి, ఎస్వోటూ జీఎం విజయ్‌ప్రసాద్, ఏరియా స్థాయి అధికారులు, ఏఐటీయూసీ ప్రతినిధులు పాల్గొన్నారు.



రక్షణపై ప్రతిజ్ఞ చేయిస్తున్న నాగేశ్వరరావు